సాక్షి
అనంతపురం
బుధవారం । 12 ఏప్రిల్ । 2023



జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్

జిల్లా జడ్జి జి.శ్రీనివాస్‌ను కలెక్టర్ ఎం.గౌతమి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు.




చీనీ టన్ను రూ.31 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.31 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం
41.6°/23.4°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఎండలు పెరిగాయి. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.



న్యూస్‌రీల్

క్రిమినల్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి. శ్రీనివాస్

అనంతపురం: మే 15న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ క్రిమినల్ కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా జడ్జి, జాతీయ న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. అనంతపురం కలెక్టర్ ఎం.గౌతమి, ఏఎస్పీ నాగేంద్రుడు, శ్రీసత్యసాయి జిల్లా అడిషనల్ ఏఎస్పీ రామకృష్ణ ఇతర పోలీసు అధికారులతో జిల్లా జడ్జి సమీక్ష నిర్వహించారు. లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి గరికపాటి దీనబాబు పాల్గొన్నారు.

అగ్రవర్ణ పేద మహిళలకు సర్కారు అండ

- నేడు 'ఈబీసీ నేస్తం' నగదు జమ

అనంతపురం రూరల్: రెడ్డి, కమ్మ, వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఓసీ సామాజికవర్గాల్లోని (ఆర్థికంగా వెనుకబడిన ఓసీ వర్గాలు) పేద మహిళలకు కూడా మేలుచేయాలన్న సత్సంకల్పంతో వారికి మెరుగైన జీవనోపాధి, ఆర్థిక సాధికారత కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' పథకం తీసుకొచ్చారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద 45 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల లోపు ఉన్న మహిళలకు ఏడాదికి రూ.15 వేల చొప్పున మూడు సంవత్సరాలకు గాను 45 వేల రూపాయలు అందించనున్నారు. 2021-22లో మొదటి విడత ఈబీసీ నేస్తం నగదు అందించగా.. రెండో విడత 2022-23కు సంబంధించి సీఎం చేతుల మీదుగా ప్రకాశం జిల్లా మార్కాపురం సభ నుంచి మహిళల ఖాతాల్లోకి నేరుగా నగదు జమచేయనున్నారు. అనంతపురం జిల్లాలో మొదటి విడత కింద 18,151 మంది మహిళల ఖాతాల్లోకి రూ.27.27 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 16,028 మంది మహిళల ఖాతాల్లోకి రూ.24.04 కోట్లు జమ చేశారు. రెండో విడతలో అనంతపురం జిల్లాలో 21,539 మంది మహిళల ఖాతాల్లోకి రూ.32.31 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 16,467 మంది మహిళల ఖాతాల్లోకి రూ.24.70 కోట్ల నగదు జమ చేయనున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈబీసీ నేస్తం పథకం అందించేలా అన్ని చర్యలూ తీసుకున్నామని బీసీ కార్పొరేషన్ ఈడీ నాగముని తెలిపారు. రెండో విడత వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ఆర్థికసాయం మంజూరు కార్యక్రమాన్ని జిల్లాస్థాయిలో బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

నైపుణ్యాభివృద్ధిరస్తు

- విద్యార్థుల్లో ప్రత్యేక నైపుణ్యాల పెంపుదల
- స్కిల్ సెంటర్ల ద్వారా సర్కారు బాసట
- డిగ్రీ కళాశాలల్లో ఉపాధి కల్పన శిక్షణ కేంద్రాలు
- నియోజకవర్గానికో స్కిల్ హబ్
- ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం స్కిల్ కాలేజీ



నైపుణ్య శిక్షణ పొందుతున్న విద్యార్థులు

అనంతపురం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిగ్రీ పట్టా ఉన్నంత మాత్రాన ఉద్యోగం దొరకడం కష్టం. చదువుకు తగ్గ కొలువు దక్కించుకోవాలంటే అదనపు నైపుణ్యాలు తప్పనిసరి. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. జిల్లాలోని 14 డిగ్రీ కళాశాలల్లో ఉపాధి కల్పన శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తోంది. అసెంబ్లీ నియోజకవర్గానికో స్కిల్ హబ్ కూడా ఏర్పాటు చేసింది. ఇక ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రత్యేకంగా 'ఎక్సలెన్స్ సెంటర్' ద్వారా శిక్షణ ఇస్తోంది.

డిగ్రీ స్థాయిలోనే నైపుణ్యాభివృద్ధి

ఉమ్మడి జిల్లాలోని 29 డిగ్రీ కళాశాలల్లో ఉపాధి కల్పన శిక్షణ కేంద్రాలు (ఎంప్లాయిబులిటీ స్కిల్ సెంటర్స్) ఏర్పాటయ్యాయి. ఇందులో అనంతపురం జిల్లా పరిధిలో 14 ఉన్నాయి. వీటి ద్వారా 2022-23 విద్యా సంవత్సరంలో 7,314 మంది డిగ్రీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అకడమిక్ కోర్సులు ఆయా కళాశాలల్లోనే అభ్యసిస్తారు. అలాగే అదనపు నైపుణ్యాలు పెంపొందించేలా తర్ఫీదు ఇస్తున్నారు. డిజిటల్ మార్కెటింగ్ అండ్ ఈ -కామర్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్, ఫార్మా మార్కెటింగ్, ట్యాలీ విత్ జీఎస్టీ, అమెజాన్ వెబ్ సర్వీసెస్, పైథాన్ ట్రెనింగ్, హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్, కమ్యూనికేషన్స్ స్కిల్స్ అండ్ లైఫ్ స్కిల్స్, ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. కోర్సు పూర్తి కాగానే ఉద్యోగాల్లో చేరేలా తీర్చిదిద్దుతున్నారు.

స్కిల్ హబ్‌లతో భవితకు దన్ను

కాలానుగుణంగా పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులకు దీటుగా నైపుణ్యాలను పెంపొందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్కిల్ హబ్ విధానాన్ని తెచ్చింది. పలు రంగాలకు చెందిన కోర్సుల్లో తర్ఫీదు ఇస్తూ అవకాశాలు కల్పించడానికి వీటిని వేదికగా మార్చింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఒక స్కిల్ హబ్ చొప్పున ఏర్పాటు చేసింది. ప్రతి బ్యాచ్‌లో 30 మందికి శిక్షణ ఇస్తోంది. నిర్దేశించిన అర్హతలు కల్గిన వారిని ఆయా కోర్సుల్లో చేర్చుకుని శిక్షణ ఇస్తున్నారు.

జిల్లాలో స్కిల్ హబ్‌ల వివరాలు

అసెంబ్లీ నియోజకవర్గం	స్కిల్ హబ్ సెంటర్	సెక్టార్
రాయదుర్గం	ప్రభుత్వ పాలిటెక్నిక్	ఐటీ, అకౌంట్స్
అనంతపురం	ఐటీఐ కళాశాల	ఫోర్‌వీలర్ సర్వీస్, ఐటీ
శింగనమల	ప్రభుత్వ పాలిటెక్నిక్ (నార్పల)	ఐటీ, ఆటోమేటివ్
గుంతకల్లు	నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్	అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ సర్వేయర్
తాడిపత్రి	ప్రభుత్వ జూనియర్ కళాశాల	టీఅండ్‌హెచ్
ఉరవకొండ	ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల	ఐటీ
కళ్యాణదుర్గం	ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల	ఐటీ
రాప్తాడు	నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్	కన్‌స్ట్రక్షన్

స్కిల్ కాలేజీలో శిక్షణ.. ఉద్యోగం

అనంతపురం జేఎన్‌టీయూలోని సీఎం ఎక్సలెన్స్ సెంటర్‌లో స్కిల్ కళాశాల ఏర్పాటైంది. ఇక్కడ నైపుణ్యం పెంపొందించడమే కాకుండా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. వేసవి సెలవుల్లో ఇంజినీరింగ్ విద్యార్థులకు అదనపు నైపుణ్యాలు పెంపొందించడానికి వీలుగా మరిన్ని కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. తాజాగా రెండు కోర్సులు నిర్వహిస్తున్నారు. సీఎన్‌సీ ప్రోగ్రామింగ్ అనే కోర్సుకు బీటెక్ మెకానికల్ పూర్తి చేసిన వారు లేదా డిప్లొమా మెకానికల్ పూర్తి చేసి రెండేళ్ల అనుభవం ఉన్న వారు అర్హులు. మూడు నెలల ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజనం, వసతి కల్పిస్తారు. నెలకు రూ.20 వేల వేతనం తగ్గకుండా ఉద్యోగం వచ్చేలా చూస్తారు. మెకాట్రానిక్స్ అనే కోర్సుకు బీటెక్ మెకానికల్, ఈఈఈ, ఈసీఈ పూర్తి చేసిన వారు లేదా డిప్లొమా పూర్తి చేసి రెండేళ్ల అనుభవం గల వారు అర్హులు. ఒక్కో బ్యాచ్‌లో 30 మంది చొప్పున ఎన్ని బ్యాచ్‌లు అయినా నిర్వహిస్తారు.

డిగ్రీ కాలేజీల్లో నైపుణ్య శిక్షణ పొందిన విద్యార్థుల వివరాలు

విద్యా సంవత్సరం	డిగ్రీ కళాశాలలు	నమోదు	శిక్షణ పూర్తయిన విద్యార్థులు
2020-21	29	13,481	2,725
2021-22	29	10,149	2,049
2022-23	14	7,314	1,476

యువతకు ప్రత్యేక శిక్షణ

చదువు పూర్తి చేసుకుని ఖాళీగా ఉంటున్న నిరుద్యోగ యువతకు కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. పీఎంకేవీవై 3.0, న్యూ ఇన్షియేటివ్, సెక్టార్ స్పెసిఫిక్, ఆర్‌పీఎల్, ఈఎస్‌డీఎం, ఆర్ డబ్ల్యూఎస్ అండ్ ఎస్ రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. 2022-23లో 830 మందికి లక్ష్యం నిర్దేశించగా, 675 మందికి ఉద్యోగాలు కల్పించారు. కియా కంపెనీలో ఉద్యోగాలు కల్పించేందుకు అనంతపురం, పెనుకొండలో రెండు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు నిర్వహిస్తున్నారు. 2022-23లో ఇప్పటి దాకా 5 వేల మందికి శిక్షణ ఇవ్వగా 4,100 మందికి కియా పరిశ్రమలో ఉద్యోగాలు కల్పించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకూ మూడు రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2022-23లో 15 ప్రోగ్రామ్‌లు నిర్వహించి 469 మందికి శిక్షణ ఇచ్చారు. ఇందులో 89 మంది యూనిట్లు స్థాపించారు. 26 మెగా జాబ్‌మేళాలు నిర్వహించి 9,500 మందికి ఉద్యోగాలు కల్పించారు.

శిక్షణ చాలా బాగుంది



రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నార్పల పాలిటెక్నిక్‌లోని స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో నెల నుంచి శిక్షణ తీసుకుంటున్నా. ఇప్పటికే కోజెంట అనే కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహించింది. శిక్షణలో సబ్జెక్ట్ నాలెడ్జ్‌తో పాటు కమ్యూనికేషన్స్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ నేర్పిస్తున్నారు. ఉద్యోగం సులువుగా సాధిస్తామనే నమ్మకం ఏర్పడింది.

– బి.కుసుమకర్, నడింపల్లి, నార్పల మండలం

ఉద్యోగంలో చేరాను



అనంతపురం ప్రభుత్వ ఐటీఐ బాయ్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో 'జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్' కోర్సులో అడ్మిషన్ పొందాను. సబ్జెక్టు నాలెడ్జ్‌తో పాటు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు (కమ్యూనికేషన్స్ స్కిల్స్), ఇంటర్వ్యూ స్కిల్స్ నేర్పించారు. కెరియర్ హెచ్‌ఆర్ సొల్యూషన్స్ అనే కంపెనీలో ఉద్యోగం దక్కింది. నాకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– పూజారి భాగ్యశ్రీ, కంబదూరు మండలం, అనంతపురం జిల్లా

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాం. జేఎన్‌టీయూలోని స్కిల్ కాలేజీని సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం రెండు కోర్సులు అందుబాటులోకి తెచ్చాం. శిక్షణతో పాటు ఉచిత భోజన, వసతి కల్పిస్తున్నాం. నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

– ఆనంద్ రాజ్‌కుమార్, జిల్లా ప్రాజెక్ట్ అధికారి, నైపుణ్యాభివృద్ధి సంస్థ

సామాజిక విప్లవకారుడు పూలే



పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యే అనంత, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

అనంతపురం సిటీ: సామాజిక రుగ్మతలను రూపుమాపిన విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. సమ సమాజ స్థాపనలో భావి తరాలకు నిత్య స్ఫూర్తిగా నిలిచిన పూలే మహనీయుడిగా చరిత్రలో మిగిలిపోయారని కొనియాడారు. పూలే జయంతిని పురస్కరించుకొని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఆర్టీసీ జోనల్ చైర్మన్ మంజుల, నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ బీసీ రమేష్ గౌడ్‌తో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు కేక్ కట్ చేశారు. అనంతరం అక్కడే ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డితో కలసి కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ఆ తరువాత జెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో బీసీ సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఖుష్బూ కొఠారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు, పేదల అభ్యున్నతికి పాటుపడిన పూలే దీన జన బాంధవుడిగా ఆయా వర్గాల హృదయాల్లో నిలిచిపోయారని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధికి పూలే చేసిన కృషిని చరిత్ర ఎప్పటికీ మరచిపోదని స్పష్టం చేశారు. విద్యతోనే మానవ వికాసం సాధ్యమన్న ఉన్నత ఆలోచనలతో పూలే విద్యాభివృద్ధికి కృషి చేశారని తెలిపారు.

నాడు పూలే.. నేడు జగన్

సమాజానికి సవాల్‌గా మారిన సామాజిక అసమానతలను రూపు మాపేందుకు మహాత్మా జ్యోతిరావు పూలే నాడు విప్లవాన్ని రగిలించగా, నేడు బడుగు, బలహీన వర్గాల వారికి రాజకీయ చైతన్యంతో పాటు సముచిత స్థానం కల్పించిన గొప్ప ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోయారని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. నాడు-నేడు కింద పాఠశాలల రూపురేఖలు మార్చి, పేద పిల్లలందరికీ ఆంగ్ల మాధ్యమంలో విద్యను అందుబాటులోకి తెచ్చిన జగన్‌ను ఆధునిక పూలేగా ఆయన అభివర్ణించారు.

మహనీయుడు పూలే

ఇల్లాలి చదువు-ఇంటికి వెలుగు అని నమ్మిన జ్యోతిరావు పూలే తొలుత తన సతీమణి సావిత్రి బాయి పూలేకి చదువు నేర్పించి, ఆ తరువాత మహిళల్లో జ్ఞాన జ్యోతి వెలిగించిన మహనీయుడిగా చరిత్రలో నిలిచిపోయారని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. జ్ఞానం ఎవరి సొత్తూ కాదని, సమాజం ఎవరి ఆధీనంలోనూ లేదని అందరికీ సమాన అవకాశాల కోసం పోరాడిన గొప్ప ఉద్యమకారుడు పూలే అని అభివర్ణించారు. సైనిక సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లా అధికారి జల్లా శ్రీనివాసులు, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ అమృతరాజ్ తమ సందేశాన్నిచ్చారు. అనంతరం ఆదిమూర్తినగర్‌లోని బీసీ బాలికల హాస్టల్ విద్యార్థినులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ శాఖల అధికారులతో పాటు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ, అనుబంధ విభాగాల నేతలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

17న ముఖ్యమంత్రి జగన్ పర్యటన



సీఎం పర్యటన ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి

- నార్పలలో బహిరంగ సభ
- జగనన్న వసతి దీవెన నగదు జమ
- ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టండి
- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం

అనంతపురం అర్బన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 17న జిల్లాలో పర్యటించనున్నారు. శింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రంలో బహిరంగ సభ ఉంటుంది. ఇక్కడి నుంచే జగనన్న వసతి దీవెన పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి కంప్యూటర్ బటన్ నొక్కి నగదు జమ చేయనున్నారు. సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటనపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ముఖ్యమంత్రి కార్యక్రమాల కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ సభ ఏర్పాట్లు జాగ్రత్తగా చేయాలన్నారు. సభకు వాహనాలు పెద్ద సంఖ్యలో వస్తాయి కాబట్టి పార్కింగ్ సౌకర్యం సమస్య రాకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎక్కడా చిన్నపాటి పొరపాటుకు తావివ్వకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, ఏఎస్పీ నాగేంద్రుడు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుళరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన్‌రెడ్డి, పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, డీటీసీ శివరామప్రసాద్, జెన్‌టీయూ, ఎస్కేయూ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

నార్పల: మండల కేంద్రం నార్పలలో సీఎం పర్యటన సందర్భంగా సభా వేదిక స్థలం, హెలిప్యాడ్ ఏర్పాట్లను కలెక్టర్ ఎం.గౌతమి, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ కేతన్ గార్గ్, ఆర్డీఓ మధుసూదన్, ఏఎస్పీ నాగేంద్రుడు, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అనంతపురం మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్‌పై అప్రమత్తం

- ముందస్తు జాగ్రత్తలు ముమ్మరం
- అందుబాటులోకి అవసరమైన మందులు
- 5700కు పైగా అందుబాటులో రెమ్‌డెసివిర్ ఇంజెక్షన్లు
- మాస్కులు, పీపీఈ కిట్‌లు జిల్లాకు పంపిన సర్కారు
- ఉమ్మడి జిల్లాలో 15 రోజుల్లో 382 టెస్టులు.. 9 పాజిటివ్ కేసులు
- అవసరాన్ని బట్టి నిర్ధారణ పరీక్షలు పెంచాలని అధికారుల యోచన

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రపంచాన్ని ఒక కుదుపు కుదిపేసిన కోవిడ్‌పై మళ్లీ అప్రమత్తం కావాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రమాదకరమేమీ కాకపోయినా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఏపీ సర్కారు భావించి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. నిర్ధారణ పరీక్షలు, కోవిడ్ నియంత్రణలో దేశంలో రోల్‌మోడల్‌గా ఏపీ నిలిచిన విషయం తెలిసిందే. తాజాగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో కోవిడ్ నియంత్రణకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తిచేసింది.

అక్కడక్కడా కేసుల నమోదు

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో గడిచిన 15 రోజుల్లో 382 శ్యాంపిళ్లు సేకరించి పరీక్షలు చేశారు. రెండు జిల్లాల్లోనూ కలిపి 9 కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో యంత్రాంగం అప్రమత్తమైంది. టెస్టుల సంఖ్య పెంచాలని యోచిస్తోంది. ముందస్తు చర్యల్లో భాగంగా ఆస్పత్రుల్లో ఐసొలేషన్ వార్డుల్లో చికిత్స అందించనున్నారు. పాజిటివ్ కేసుల సంఖ్య పెరిగినా అందుకు తగ్గట్టు ఇంజెక్షన్లు, మాత్రలు, మాస్కులు వంటివి అందుబాటులో ఉంచారు. బోధనాస్పత్రి నుంచి పీహెచ్‌సీ వరకు కోవిడ్ చికిత్స మందులు సమకూర్చారు.



అనంతపురం సర్వజనాస్పత్రిలో కాన్సంట్రేటర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి

కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సంసిద్ధం

జిల్లాలో కోవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి తెలిపారు. అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని మంగళవారం ఆయన సూపరింటెండెంట్ రఘునందన్‌తో కలిసి పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మాక్‌డ్రిల్‌ను రెండోరోజూ కొనసాగించినట్లు చెప్పారు. ఆయా ఆస్పత్రుల్లో ఉన్న వసతులను క్లస్టర్ వారీగా పరిశీలించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కూడా కోవిడ్‌కు వినియోగిస్తున్నామన్నారు. ప్రధానంగా ఆక్సిజన్ ప్లాంట్లలో ఆక్సిజన్ నిల్వ, బెడ్లు, వెంటిలేటర్లు, ఆక్సిజన్ కాన్సంట్రేటర్ వివరాలు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, క్యాన్సర్ ఆస్పత్రి, సీడీ ఆస్పత్రి, జిల్లాలో ఉన్న రెండు ఏరియా ఆస్పత్రులు, 8 సీహెచ్‌సీలు, 45 పీహెచ్‌సీలు, 52 ప్రైవేటు ఆస్పత్రులను సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుజాత, వేణుగోపాల్‌యాదవ్, నారాయణస్వామి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు అందుబాటులో ఉన్న కోవిడ్ చికిత్స మందులు

కేటగిరీ	అందుబాటులో ఉన్నవి
రెమ్‌డెసివిర్ 100 ఎంజీ	5,772
డెక్సామిథజోన్ ఇంజెక్షన్ 8 ఎంజీ	65,087
ఎనాక్సోపారిన్ ఇంజెక్షన్ 40 ఎంజీ	26,955
హెపారిన్ ఇంజెక్షన్ ఐపీ 1000 ఎంఎల్	1,300
ఆంపోటెరిసిన్ బీ 50 ఎంజీ	1,376
ఎన్-95 మాస్కులు	64,882
పీపీఈ కిట్‌లు	35,203
ట్రిపుల్ లేయర్ సర్జికల్ మాస్కులు	46,419

విలేజ్ క్లినిక్ స్థాయి నుంచే..

జిల్లాలో 433 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. 71 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. విలేజ్ హెల్త్ క్లినిక్ స్థాయి నుంచే కోవిడ్ ఉపకరణాలు అందుబాటులో ఉంచాం. అవసరమైతే టెస్టులు పెంచాలని చెప్పాం. దీనిపై అప్రమత్తంగా ఉన్నాం.

–డా.యుగంధర్, నోడల్ అధికారి

రేపు అనంతపురంలో జాబ్‌మేళా

అనంతపురం టౌన్: అనంతపురంలోని జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఈ నెల 13న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి ఎ.కళ్యాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిగ్రీతో పాటు బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగులకు ప్రముఖ ఆటోమేటివ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇంటర్వ్యూలలో ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ధర్మవరం, పెనుకొండ, పుట్టపర్తి, గోరంట్ల, అనంతపురం, కొత్తచెరువు తదితర ప్రాంతాల్లో విధులు కొనసాగించాల్సి ఉంటుందన్నారు. జీతం రూ.14వేలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 13న విద్యార్హత పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

క్లుప్తంగా

జ్యోతిరావు పూలే స్ఫూర్తిదాత



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: పేద, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, అంటరానితనాన్ని రూపుమాపేందుకు కృషి చేసిన సామాజిక సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అందరికీ స్ఫూర్తిదాతగా నిలిచారని రాష్ట్ర స్త్రీ ,శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళాభ్యున్నతికి పూలే చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, సచివాలయ కన్వీనర్లు పెరుగు తిమ్మరాజు, ఉమేష్‌రెడ్డి, బ్రహ్మసముద్రం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బసవరాజు, నాయకులు బాలు, చంద్రశేఖరరెడ్డి, లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపిక రేపు



అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 13న జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపికను ఆర్డీటీ క్రీడా మైదానంలో చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి అనిల్ రాజ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఎంపికలకు 1994, జనవరి 1 తర్వాత జన్మించిన క్రీడాకారులు హాజరు కావాలి. 10వ తరగతి మార్క్స్ మెమో, ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలి. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకూ శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుంది.

‘ఉపాధి’కి నూతన ప్రణాళిక

- తొలి విడతగా 90 లక్షల పనిదినాలు
- 60 వేలకు చేరువలో కూలీల నమోదు
- ఒకట్రెండు రోజుల్లోనే లక్ష దాటేలా ప్రణాళికలు

రాయదుర్గం: జిల్లాలో ఉపాధి పనులకు నూతన ప్రణాళిక సిద్ధమైంది. 2023–24వ ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులు ఖరారయ్యాయి. తొలి విడతలో 90 లక్షల పనిదినాలు రూపొందించగా, ఈ నెల 1 నుంచి పనుల కల్పనకు అధికారులు శ్రీకారం చుట్టారు. లక్ష్యసాధన దిశగా కూలీల హాజరు శాతం పెరిగేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లాలో రోజూ 58 వేల మంది కూలీలు ఉపాధి పనుల్లో పాలుపంచుకుంటుండగా.. ఒకట్రెండు రోజుల్లో ఈ సంఖ్యను లక్ష దాటించేలా చర్యలు తీసుకున్నారు.

పనిదినాలకు ఆమోదం : జిల్లాలో 3.09 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, ఇందులో 5.74 లక్షల మంది కూలీల కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. మొత్తం 1.41 కోట్ల పనిదినాలు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపగా, తొలి విడతలో 90 లక్షల పనిదినాలకు ఆమోదం దక్కింది. అడిగిన ప్రతి కూలీకి ఉన్న ఊరిలోనే పనులు కల్పించేలా అధికారులు ముందస్తు



గుమ్మఘట్ట మండలం కలుగోడు వద్ద ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ప్రణాళికలు చేపట్టారు. దీనికి తోడు గతంలో దినసరి కూలి రూ.257 మాత్రమే చెల్లించేవారు. దానికి అదనంగా రూ.15 పెంచి మొత్తం రూ.272తో వేతనం అందించనున్నారు. దీనికి తోడు వేసవి అలవెన్సు కలసి రావడంతో పనులను సద్వినియోగం చేసుకునేందుకు కూలీలు ముందుకు వస్తున్నారు.

శ్రమించే వారికి ప్రాధాన్యత : ఉపాధి పథకంలో సమూల మార్పులు చోటు చేసుకోవడంతో శ్రమించే కూలీలకు ప్రాధాన్యతనివ్వనున్నారు. గతంలో మాదిరిగా తూతూమంత్రంగా పనులు చేసి హాజరు వేసుకుని వెళ్లాలనుకునేవారి ఆటలు ఇకపై సాగవు. ఉపాధి పథకంలో కూలి చెల్లింపులు, మెటీరియల్ కంపోనెంట్ నిధులను 60:40 నిష్పత్తి ప్రకారం లెక్కిస్తారు. కూలి ఎంత ఎక్కువ చెల్లింపు ఉంటే అంత మొత్తంలో మెటీరియల్ కంపోనెంట్ నిధులు విడుదలవుతాయి. ఉదాహరణకు ఓ కూలీ రోజు పనిచేసి రూ.100 సంపాదిస్తే, అతడికి అందాల్సిన మిగిలిన రూ.172 రద్దవుతుంది. ఇందుకు సంబంధించి 40 శాతం మెటీరియల్ కంపోనెంట్ నిధులు కూడా మంజూరు కావు. దీంతో జిల్లా అధికారులు ఈ సారి యాక్టివ్ కూలీలకు పనుల్లో ప్రాధాన్యత కల్పిస్తున్నారు.

జిల్లాలో జాబ్‌కార్డులు	3.09 లక్షలు
యాక్టివ్ కూలీల సంఖ్య	5.74 లక్షలు
చేపట్టే పనులు	96 రకాలు
పనిదినాల లక్ష్యం	90 లక్షలు
రోజు వారీ చెల్లించే కూలి	రూ.272

సొంతూరిలోనే ఉపాధి

నూతన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం 58 వేల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఈ సంఖ్యను ఒకట్రెండు రోజుల్లో లక్ష దాటించే ప్రయత్నం చేపట్టాం. ప్రతి మండలానికి 4 వేల మంది కూలీలు తగ్గకుండా టార్గెట్ విధించాం. సొంతూరులోనే పనులు కల్పిస్తున్నాం. దినసరి కూలి రూ.272 చెల్లిస్తున్నాం. దంపతులిద్దరూ హాజరైతే రూ.544 సంపాదించుకోవచ్చు. 90 లక్షల పనిదినాలు పూర్తికాగానే రెండో విడతలోనూ మరిన్ని పనిదినాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం.

– వేణుగోపాలరెడ్డి, డ్వామా పీడీ

అనంతకు చేరిన నూతన ఎస్పీ



జిల్లా నూతన ఎస్పీ కె.శ్రీనివాసరావును స్వాగతిస్తున్న అదనపు ఎస్పీలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా నూతన ఎస్పీ కె. శ్రీనివాసరావు మంగళవారం రాత్రి 7 గంటలకు అనంతకు చేరుకున్నారు. పోలీసు అతిథి గృహం వద్ద ఆయనకు అదనపు ఎస్పీలు నాగేంద్రుడు, హనుమంతు, సీఐలు భాస్కరగౌడ్, మోహన్, కత్తి శ్రీనివాసులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం డీఐజీ రవిప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మద్యం మానమంటే.. పురుగుల మందు తాగాడు!



మృతుడు రంగయ్య

శెట్టూరు: మద్యం తాగొద్దంటే పురుగుల మందు తాగి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండలం మాలేపల్లికి చెందిన రంగయ్య (60) క్షయ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో చికిత్స అందజేస్తున్న వైద్యులు.. మద్యం మానాలని సూచించారు. అయినా రంగయ్య రోజూ మద్యం సేవించేవాడు. దీంతో శనివారం కుటుంబసభ్యులు మందలించారు. మనస్తాపం చెందిన రంగయ్య.. అదే రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కాసేపటి తర్వాత ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు.. అపస్మారక స్థితిలో పడి ఉన్న రంగయ్యను గమనించిన వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి బలవన్మరణం

బొమ్మనహాళ్: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లుకు చెందిన రజాక్ సాహెబ్ (42)కు భార్య మాబున్నీ, ఇద్దరు కుమారులున్నారు. కొలుకు పొలం తీసుకుని వ్యవసాయంతో పాటు కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. పంటల సాగు, కుటుంబ అవసరాలకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. దీంతో కుటుంబంలో కలహాలు చోటు చేసుకోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి చేరుకున్న రజాక్ సాహెబ్... భోజనం ముగించుకున్న తర్వాత గ్రామ శివారుకు చేరుకుని చెట్టుకు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. గ్రామ శివారున చెట్టుకు వేసుకున్న ఉరికి వేలాడుతున్న రజాక్ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

సేవలను మరింత చేరువ చేయండి

- అడిషనల్ డీఎంఈ రాఘవేంద్రరావు

అనంతపురం సప్తగిరి సర్కిల్: రోగులకు మరిన్ని నాణ్యమైన సేవలను చేరువ చేయాలని వైద్యులకు వైద్య విద్య అడిషనల్ డైరెక్టర్ రాఘవేంద్రరావు ఆదేశించారు. సర్వజనాస్పత్రిని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. గైనిక్, జనరల్ మెడిసిన్, సైకియాట్రిక్, పీడియాట్రిక్ ఓపీలను ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడుతూ వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్య విభాగాల అధిపతులతో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సమావేశమై మాట్లాడారు. ఆయా విభాగాల్లో ఎదురయ్యే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులు పూర్తి బాధ్యతతో బోధన చేయాలన్నారు. గైనిక్, పీడియాట్రిక్ యూనిట్లను పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. నవజాత శిశువులకు సంబంధించి ప్రత్యేకంగా ఎన్ఐసీయూను ఏర్పాటు అంశంపై సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, వైద్య విభాగాల అధిపతులు డాక్టర్ నవీద్ అహమ్మద్, నవీన్‌కుమార్, భీమసేనాచారి, రామస్వామి, సుహాసిని, రామస్వామి, సౌజన్యకుమార్, ఆర్ఎంఓ డాక్టర్ వైవి రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రాఘవేంద్ర రావు

మెడికోలకు ఐడెంటిటీ కార్డుల అందజేత

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఐదో సెమిస్టర్ చదువుకుంటున్న విద్యార్థులకు ఐడెంటిటీ కార్డులను అడిషనల్ డీఎంఈ డాక్టర్ రాఘవేంద్ర రావు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని సెంట్రల్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సమాజంలో వైద్యవృత్తి చాలా కీలకమని, బాధ్యతాయుతమైన చికిత్సను రోగులకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రోగుల సమస్యను సావధానంగా విన్నప్పుడే మంచి వైద్యాన్ని అందించేందుకు వీలుంటుందన్నారు. వ్యాధి నిర్ధారణ చేయకుండా ఎలాంటి వైద్యాన్ని అందించరాదని సూచించారు.

అడిషనల్ డీఎంఈకి వినతిపత్రం

ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన కింద కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న 21 మంది ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ కింద మార్చారని, దీని వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామంటూ ఈ సందర్భంగా డాక్టర్ రాఘవేంద్రరావుకు సంబంధిత ఉద్యోగులు విన్నవించారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. తమకు ఉద్యోగాలు అందించే సమయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఎంపిక చేసినట్లు తెలిపారు. అయితే ఆరు నెలల తర్వాత ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఎంపిక చేసినట్లు ఉత్తర్వులు అందజేశారన్నారు. తమను కాంట్రాక్ట్ ఉద్యోగులుగానే పరిగణించాలని కోరారు.

ఎలాంటి పైరవీలూ వద్దు

- నేడు 1 నుంచి 280వ సంఖ్య వరకు కౌన్సెలింగ్

రాప్తాడు రూరల్: డీఎస్సీ -98 అభ్యర్థులు స్థానాల కోసం ఎలాంటి పైరవీలూ చేసుకోవద్దని డీఈఓ ఎం.సాయిరామ్ స్పష్టం చేశారు. డీఎస్సీ-98లో అర్హత సాధించిన అభ్యర్థుల మెరిట్ జాబితా మేరకు పారదర్శకంగా కౌన్సెలింగ్ చేపడతామన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు వరుస నంబరు 1 నుంచి 280 వరకు గల అభ్యర్థులకు అనంతపురం సైన్స్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ప్రారంభవుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 536 మంది అభ్యర్థులకు పోస్టింగులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్, ఇంటర్వ్యూ లెటర్, ఒరిజనల్ విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డ్, 3 ఫొటోలు, సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి తీసుకురావాలని సూచించారు.

ఖాళీలపై సుదీర్ఘంగా కసరత్తు

ఖాళీలపై మంగళవారం సుదీర్ఘంగా కసరత్తు చేశారు. ఏడీ కృష్ణయ్య, సిబ్బందితో డీఈఓ కూర్చుని విద్యార్థుల సంఖ్య, పని చేస్తున్న టీచర్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని ఎక్కడైతే కచ్చితంగా అవసరమో ఆ ఖాళీలను గుర్తించేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి స్కూల్‌లోనూ టీచరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. కౌన్సెలింగ్ సమయంలో ఖాళీలను ప్రకటిస్తాని డీఈఓ తెలిపారు. మెరిట్ ఆధారంగా అభ్యర్థులను పిలిపించి ఖాళీలను చూపిస్తూ ఎంపిక చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా గైర్హాజరైతే రెండోరోజు కూడా వారికి అవకాశం ఇస్తామన్నారు. రెండోరోజు కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఎవరైనా వచ్చినా అనుమతివ్వబోమని స్పష్టం చేశారు.

ఎస్కేయూ విద్యార్థిపై దాడి - కిడ్నాప్

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థి అభిషేక్‌పై బయటి వ్యక్తులు దాడి చేసి, కిడ్నాప్ చేశారు. మంగళవారం రాత్రి 9 గంటలకు ఆటోలో క్యాంపస్‌లోకి ప్రవేశించిన దుండగులు.. అభిషేక్‌పై ఇనుపరాడ్లు, ఊచ కర్రల విచక్షణారహితంగా దాడి చేశారు. సమాచారం అందుకున్న ఇటుకలపల్లి పోలీసులు అక్కడకు చేరుకోవడంతో గమనించిన దుండగులు, తాము వచ్చిన ఆటోను అక్కడే వదిలేసి ద్విచక్ర వాహనంపై అభిషేక్‌ని అపహరించుకెళ్లారు. దుండగుల చర్యలను అడ్డుకునేందుకు విద్యార్థులు, పోలీసులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అభిషేక్ సెల్‌ఫోన్‌కు ఎస్కేయూ అధికారులు కాల్‌చేస్తున్నా ఎలాంటి స్పందన లేదు. దీంతో వర్సిటీలో ఆందోళన మొదలైంది. ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాడికి సంబంధించిన వివరాలను డిప్యూటీ వార్డెన్ ఆంజనేయులుతో రాబట్టారు. కాగా, ఎందుకు దాడి చేసి, కిడ్నాప్ చేశారనేది తెలియాల్సి ఉంది.

ర్యాష్ డ్రైవింగ్‌తో వాహనాలను ఢీకొట్టి..

- కాలవ భరత్ డ్రైవర్ వీరంగం
- విప్ కాన్వాయ్‌పైకి దూసుకెళ్లిన వైనం
- త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

రాయదుర్గం: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు కుమారుడు కాలవ భరత్ వాహన డ్రైవర్ వీరంగం సృష్టించాడు. ఐదు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బొమ్మనహాళ్ మండలం సింగానహళ్లిలో ఈ నెల ఏడో తేదీ జరిగిన సంగమేశ్వర రథోత్సవానికి డ్రైవర్‌తో కలసి భరత్ హాజరయ్యారు. తిరుగుప్రయాణంలో సింగానహళ్లి– శ్రీధరఘట్ట మార్గమధ్యంలోకి చేరుకోగానే.. ఎదురుగా వస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కాన్వాయ్‌పైకి కాలవ భరత్ వాహనం దూసుకెళ్లింది. అప్రమత్తమైన పోలీస్ ఎస్కార్ట్ వాహన డ్రైవర్ వారి వేగం నుంచి తప్పించుకోగా, దాని వెనుకనే ఉన్న విప్ వాహనాన్ని ఢీకొనడంతో సైడ్ మిర్రర్ పగిలింది. సకాలంలో మేల్కొన్న విప్ వాహన డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వాహనాన్ని పక్కకు నిలిపారు. దీంతో త్రుటిలోనే ఘోర ప్రమాదం తప్పిందని కాన్వాయ్‌లోని వారంతా ఊపిరి పీల్చుకున్నారు. కాలవ భరత్ వాహన డ్రైవర్ అంతటితో ఆగకుండా వెనుక ఉన్న మరో వాహనానికి అడ్డం వస్తూ దారి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టాడు. పోలీసులతో పాటు కాన్వాయ్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు పరుగెత్తుకెళ్లి తలుపుతీసి చూడగా డ్రైవర్‌తో పాటు పక్కనే కాలవ భరత్ ఉండటాన్ని చూసి నివ్వెరపోయారు. అక్కడే ఉన్న బొమ్మనహాళ్ ఎస్ఐ శివ.. కాలవ భరత్ వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా.. విప్ కాపు వదిలిపెట్టాలని సూచించారు. ఈ విషయం ఐదు రోజులుగా ఆనోట ఈ నోట నాని ఎట్టకేలకు బయటకు పొక్కడంతో సర్వత్రా చర్చనీయాంశమైంది. కావాలనే ఇలా చేశారా? లేక తప్పతాగి వాహనం నడిపి ఉంటారా? అనేది తేలాల్సి ఉంది. ఈ విషయంపై బొమ్మనహాళ్ ఎస్ఐ శివను సంప్రదించగా.. ఘటనపై సమగ్ర విచారణ కొనసాగిస్తున్నామని తెలిపారు. అవసరమైతే డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పూర్తి వివరాలు రాబడతామన్నారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం వాయిదా

అనంతపురం సప్తగిరి సర్కిల్: మంగళవారం జరగాల్సిన ప్రభుత్వ సర్వజనాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం వాయిదా పడింది. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ తెలిపారు. సాంకేతిక కారణాల రీత్యా వాయిదా వేసిన సమావేశాన్ని మళ్లీ నిర్వహించబోయే తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

అప్పలనాయుడుకు చిలకూరి పురస్కారం

అనంతపురం కల్చరల్: ప్రతిష్టాత్మక చిలకూరి దేవపుత్ర పురస్కారం ఈ ఏడాదికి ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడుకు దక్కింది. ఈ మేరకు నిర్వాహకులు లక్ష్మీదేవపుత్ర, దీవెన మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24న అప్పలనాయుడుకు పురస్కారాన్ని అందజేయనున్నట్లు వివరించారు. అవార్డు ఎంపికకు జ్యూరీ సభ్యులుగా ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, బండి నారాయణస్వామి, ఆచార్య బాలసుబ్రహ్మణ్యం, శాంతినారాయణ వ్యవహరించారు.

రేషన్ బియ్యం డంప్ స్వాధీనం

గుత్తి రూరల్: మండలంలోని పెద్దొడ్డిలో అక్రమంగా నిల్వ ఉంచిన 70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు తెలిపిన మేరకు.. పెద్దొడ్డికి చెందిన తపిల చిరంజీవి కొంత కాలంగా రేషన్ బియ్యాన్ని కర్ణాటక ప్రాంతానికి తరలించి సొమ్ము చేసుకునేవాడు. ఈ క్రమంలో అందిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి చిరంజీవి ఇంట్లో 70 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని తరలించేందుకు ఉపయోగించే ఐషర్ వాహనాన్ని సీజ్ చేశారు. చిరంజీవితో పాటు ముదిగుబ్బ మండలం ఆర్ఎస్ తండాకు చెందిన బోనాత్ గిరిబాబు, ఐషర్ డ్రైవర్ గోపాల్‌నాయక్, ధర్మవరం నివాసి రమేష్ నాయక్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు.

బెళుగుప్ప: గుండ్లపల్లి వద్ద ఆటోలో తరలిస్తున్న 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఎస్ఐ రామకృష్ణయ్య స్వాధీనం చేసుకుని, శెట్టూరు మండలం మాల్యనాయకనహళ్లి నివాసి ఆంజనేయులుని అరెస్ట్ చేశారు.

పూలే ఆశయసాధనకు కృషి చేద్దాం

- ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి పిలుపు



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, బీసీ కమిషన్ సభ్యుడు కిష్టప్ప

అనంతపురం క్రైం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి చేద్దామంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. పూలే జయంతిని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. జ్యోతిరావు పూలే ఆశయ సాధన సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమవుతుందన్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా బడుగుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత, మహిళా సాధికారతకు పెద్ద పీట వేశారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ ఎం.మంజుల, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, బీసీ కమిషన్ సభ్యుడు కిష్టప్ప, మాజీ మేయర్ రాగే పరుశురాం, డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరా, జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సైఫుల్లాబేగ్, నాయకులు ఆలమూరు శ్రీనివాస రెడ్డి, అనిల్‌కుమార్‌గౌడ్, ధనుంజయయాదవ్, కృష్ణవేణి, రాధా యాదవ్, మునీరా, తదితరులు పాల్గొన్నారు.

బడుగుల బైక్ ర్యాలీ

అనంతపురం సిటీ: మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని అనంతపురంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ చైర్మన్ బీసీ రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాల వారు మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ కార్యాలయం నుంచి బయల్దేరిన బైక్ ర్యాలీ సప్తగిరి సర్కిల్, టవర్ క్లాక్, శ్రీకంఠం సర్కిల్ మీదుగా కొనసాగి మళ్లీ జెడ్పీ కార్యాలయం వద్దకు చేరుకుంది. కార్యక్రమాన్ని ఉద్దేశించి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు ఉద్యమించిన పూలే జీవితం ఆదర్శప్రాయమని కొనియాడారు. క్లాక్ టవర్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్‌కు పూలే పేరు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జోగి రాజేంద్ర పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న రమేష్ గౌడ్ తదితరులు

క్లుప్తంగా

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చెన్నేకొత్తపల్లి: కస్తూరిబాగాంధీ బాలిక విద్యాలయంలో 6, 11 తరగతుల ప్రవేశానికి, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్‌ఓ నరసమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనాథలు, బడిబయట ఉన్న పిల్లలు డ్రాపౌట్స్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20 తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వ్యవసాయశాఖ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జేడీఏ చంద్రానాయక్

అనంతపురం అగ్రికల్చర్: ఏపీ వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం డైరీని జేడీఏ చంద్రానాయక్ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్‌ను హరితవనంగా మార్చాలి



జేఎన్‌టీయూ అనంతపురం ప్రొఫెసర్ జింకా రంగజనార్ధనతో వాచ్‌మెన్, స్వీపర్లు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్‌ను హరితవనంగా మార్చాలని వీసీ జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో పనిచేస్తున్న వాచ్‌మెన్, స్వీపర్లకు ఏకరూప దుస్తులు (యూనిఫాం)పంపిణీ చేశారు. విధుల్లో తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని కోరారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, పీఆర్వో డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి, వర్సిటీ డీఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలిక



ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఉన్న సంజన

అనంతపురం: తప్పిపోయిన సంజన అనే చిన్నారిని ఇటుకలపల్లి పోలీసులు మంగళవారం ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. నగరంలోని టీవీ టవర్ సమీపంలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన రామాంజనేయులు, లక్ష్మీదేవి కుమార్తె సంజన మంగళవారం సాయంత్రం తప్పిపోయింది. నాన్నమ్మ వద్ద నుంచి టీవీటవర్ సమీపంలో తినుబండారాలు కొనుగోలు చేసేందుకు వెళ్లి దారితప్పిపోయింది. సంజనను చూసి స్థానికులు ఇటుకలపల్లి పోలీసులకు అప్పగించారు. పోలీసులు చిన్నారి వివరాలను సోషల్‌మీడియాలో షేర్ చేశారు. తల్లిదండ్రులు ఆమెను గుర్తించి ఇటుకులపల్లి పోలీస్‌స్టేషన్ చేరుకున్నారు. సోషల్ మీడియాలో సంజన వివరాలు తెలుసుకునే వరకూ ఆమె తల్లిదండ్రులు కుమార్తె ఆచూకీ కోసం తల్లడిల్లారు. తక్షణమే స్పందించిన ఇటుకలపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్ యాదవ్ చొరవచూపారని బాలిక తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే

- ఎస్కేయూ, జేఎన్‌టీయూఏ వీసీలు రామకృష్ణారెడ్డి, జింకా రంగా జనార్దన

అనంతపురం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, దార్శనికుడు మహాత్మాజ్యోతిరావు పూలే అని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి, జేఎన్‌టీయూఏ వీసీ జింకా రంగజనార్దన పేర్కొన్నారు. ఎస్కేయూ, జేఎన్‌టీయూ అనంతపురంలో మహాత్మాజ్యోతిరావు పూలే 196వ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. ఆయన జీవితం ఒక సందేశాత్మకమైనదని, ఎంపిక చేసుకున్న గమ్యం చాలా విలువైందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికై ఆయన జీవితాన్నే పణంగా పెట్టారన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ పతికి రమేష్ నారాయణ మాట్లాడుతూ అంటరానితనాన్ని నిర్మూలించడానికి పూలే దంపతుల కృషి ప్రశంసనీయమన్నారు. రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ప్రిన్సిపాళ్లు డాక్టర్ బాలసుబ్రమణ్యం, ప్రొఫెసర్ కృష్ణకుమారి, డాక్టర్ ఎస్‌ఆర్ సదాశివా రెడ్డి, సదస్సు కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నరేంద్ర మద్దు సిబ్బంది జ్యోతిరావు పూలే సేవలు కొనియాడారు.

- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మహాత్మాజ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, అసిస్టెంట్ లైబ్రేరియన్ ఇంతియాజ్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సెంట్రల్: పూలే జీవితం ఆదర్శమని ఆర్డీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, ఆర్‌ఎం సుమంత్ ఆర్ ఆదోని కొనియాడారు. మంగళవారం ఆర్ఎం కార్యాలయంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ మోహన్‌కుమార్, ఎన్ఎంయూ, ఈయూ, బీసీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పూలే అడుగుజాడల్లో ప్రతి ఒక్కరం నడుద్దామని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలపోతన్న తెలిపారు. మంగళవారం పి.యాలేరు పంచాయతీలో పూలే జయంతి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరోగ్యంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాష్‌రెడ్డి, అతికిరెడ్డి, జయన్న, బాబయ్య పాల్గొన్నారు.

ఏపీ బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి ఏపీ బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ చింతా చంద్రమోహన్ నాయకత్వంలో కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతపురం టవర్‌క్లాక్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పూలే విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కాపు వాసు, ఫక్రుద్దీన్, రవి, ప్రసాద్, ఆంజనేయులు, రామాంజి పాల్గొన్నారు.

రాప్తాడు: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు జరిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పూలే చిత్రపటానికి అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ మాధవి, ఏఓ రత్నబాయి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు చిన్న క్రిష్ణారెడ్డి, మధుజీసూన్ రెడ్డి, క్రిష్ణాపురం రవి పాల్గొన్నారు.



మహాత్మాజ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం



నివాళి అర్పిస్తున్న మాల్యవంతం మంజుల, ఆర్‌ఎం సుమంత్



జేఎన్‌టీయూ అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వీసీ జింకా రంగజనార్దన తదితరులు

రూ.76.33 లక్షల ఇంటి పన్ను వసూలు

అనంతపురం క్రైం: ఇంటి పన్ను రూ.76.33 లక్షలు వసూలైంది. ప్రభుత్వం 5 శాతం రాయితీ కల్పించడంతో నిర్వాసితులు పన్ను చెల్లించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. మంగళవారం బకాయిదారులతో నగరపాలక సంస్థలోని ఐదు కౌంటర్లు కిక్కిరిశాయి. ఈ నెలాఖరు వరకు మాత్రమే రాయితీకి అవకాశం ఉందని, ప్రజలు త్వరితగతిన పన్ను చెల్లించాలని కమిషనర్ రమణారెడ్డి కోరారు.

కనుల పండువగా రేణుకాయల్లమ్మ జాతర



రేణుకా యల్లమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్: నగరంలోని ఐదోరోడ్డు రేణుకా యల్లమ్మ తల్లి జాతర మంగళవారం ముగిసింది. ఉదయం పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోనాలు సమర్పించారు. సంప్రదాయ డప్పు మోతలు, మంగళవాయిద్యాల నడుమ భక్తిగీతాలు ఆలపించారు. అమ్మవారిని స్తుతిస్తూ నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మధ్యాహ్నం వివిధ ప్రాంతాల నుంచి సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని రెండో రోడ్డులోని బహవుద్దీన్ మసీదులో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు మహమ్మద్ ఆసిఫ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. ఆయన భోజనం వడ్డించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసంలో ప్రతి మంచి కార్యానికీ ఎంతో పుణ్యాన్ని అల్లా అందిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, నాయకులు సుజాతరెడ్డి, భారతి, అనిల్‌కుమార్ గౌడ్, కువైట్ ఖాదర్ బాషా, బుడెన్, షేర్ అలీఖాన్, అబ్దుల్లా, నవాజ్, వసీం, షాషు, ఇద్రిస్, దాదు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



బహవుద్దీన్ మసీదులో అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

డెకాయ్ ఆపరేషన్‌లో 10 టన్నుల ప్లాస్టిక్ సీజ్

అనంతపురం క్రైం: నిషేధిత ప్లాస్టిక్‌ను నియంత్రించడానికి నగరపాలక సంస్థ అధికారులు చేపట్టిన డెకాయ్ ఆపరేషన్ విజయవంతమైంది. మంగళవారం నగరంలోని అనుమానాస్పద షాపుల్లో నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్‌రెడ్డి, పారిశుద్ధ్య కార్యదర్శులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్‌రావు బృందం డెకాయ్ ఆపరేషన్ చేపట్టింది. పలు ప్రాంతాల్లో 10 టన్నుల ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. పారిశుద్ధ్య కార్యదర్శులు ప్లాస్టిక్‌ను కొనుగోలు చేసే విధంగా కమలానగర్ రాజురోడ్డులోని మహాలక్ష్మి ప్లాస్టిక్ షాపు నిర్వాహకుడు ప్రతాప్ రామ్ వద్దకు వెళ్లారు. కేజీల్లో ప్లాస్టిక్ కావాలని చెప్పడంతో ప్రతాప్‌రామ్ తన షాపు వెనుకవైపు ఏర్పాటు చేసుకున్న భారీ షెడ్డును తెరిచాడు. సమీప ప్రాంతంలోనే ఉన్న అధికారులు ఒక్కసారిగా గొడౌన్‌లోకి చొరబడి, పలు రకాల నిషేధిత ప్లాస్టిక్ గుట్టలుగా ఉండడాన్ని గుర్తించారు. అదే ప్రాంతంలోని మహావీర్ షాపుకు చెందిన గొడౌన్‌ను అధికారులు తనిఖీ చేయగా, మరో ఏడు టన్నుల ప్లాస్టిక్‌ను అధికారులు గుర్తించారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తూ మోసం :

ప్లాస్టిక్ కవర్లపై వేసిన లేబుళ్లలో తిరకాసును అధికారుల తనిఖీలో గుర్తించారు. మైక్రాన్ పరికరం ద్వారా 120 మైక్రాన్స్ అని ముద్రించిన ప్లాస్టిక్‌ను తనిఖీ చేయగా 49, 50, 60 అంటూ చూపింది. సదరు నిర్వాహకుడు పేరుకుమాత్రం ప్లాస్టిక్ కవర్లపై 120 మైక్రాన్స్ చూపి, నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయిస్తూ, ప్రజలను సైతం మోసం చేసినట్లు అధికారుల తనిఖీలో తేలింది. నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్న మహాలక్ష్మి ప్లాస్టిక్స్‌పై రూ.50వేలు, మహావీర్ ప్లాస్టిక్స్‌పై రూ.50వేలు జరిమానా విధిస్తున్నట్లు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. కమిషనర్ వెంట ఎస్‌ఐలు శ్రీనివాసులు, గౌస్, నగరపాలక సంస్థ ఆర్‌ఐ మురళీ, తదితరులున్నారు.

వైభవంగా దుర్గమ్మ పార్వేట

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో మంగళవారం దుర్గమ్మ దేవతకు పార్వేట నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. సాయంత్రం దుర్గమ్మ దేవత ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పొలిమేర వరకు ఊరేగించి, అక్కడ పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని యువకులు వేటలకు వెళ్లి తెచ్చిన కుందేళ్లను అమ్మవారి ముందు జనం మధ్యలో వదిలి పార్వేట నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు స్థానిక గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. రాత్రికి దుర్గమ్మ దేవతను గ్రామంలో ఊరేగించారు.



మామిళ్లపల్లిలో దుర్గమ్మ పార్వేటలో ఉత్సాహంగా పాల్గొన్న యువకులు

ఏడుగురికి మెమోలు

అనంతపురం క్రైం: విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ విధులకు డుమ్మా కొడుతున్న ఏడుగురు జూనియర్, సీనియర్ అసిస్టెంట్లకు నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి మంగళవారం మెమోలు జారీ చేశారు. ఎలాంటి సమాచారం లేకుండా అనధికారికంగా ఉద్యోగాలకు హాజరుకాకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. గైర్హాజరుకు సమాధానం ఇవ్వాలని, లేని పక్షంలో క్రమశిక్షణా చర్యలకు వెనుకాడబోమని తెలిపారు.

16న ఉచిత మోడల్ పరీక్ష

అనంతపురం: బార్ అసోసియేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సంయుక్తంగా జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఈ నెల 16న ఉచిత మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అనంతపురం అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు రాత పరీక్ష ఉంటుందన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలు

రామగిరి: పేరూరులో గ్రామదేవత కొల్లాపురమ్మ ఆశీస్సులతో రాతిదూలం లాగుడు పోటీలు మంగళవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని పది గ్రామాలకు చెందిన కాడెద్దులు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతిని గార్లెదిన్నకు చెందిన రామాంజనేయులకు రూ.30వేలు అందించారు. ద్వితీయ బహుమతి గంగవరానికి చెందిన గురు యాదవ్‌కు చెందిన వృషభాలు రూ.20వేలు గెలుపొందాయి. తోపుదుర్తికి చెందిన చెన్నప్ప వృషభాలు తృతీయ బహుమతి కింద రూ.10వేలు గెలుపొందాయి.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్ సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందాయని జెడ్పీటీసీ గోవిందరెడ్డి తెలిపారు. మంగళవారం ఓబుళంపల్లి, బసంపల్లి, వెంకటంపల్లి, ప్యాదింటి, మేడాపురం, గ్రామాల్లో పార్టీ నాయకులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు డోలు రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ వెంకటరెడ్డి, సర్పంచ్‌లు జయరామిరెడ్డి, ఓబుళేసు, చెన్నారెడ్డి, గోపాల్ రెడ్డి, నాయకులు కరె క్రిష్టప్ప, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ గౌతమికి ఘన స్వాగతం



కలెక్టర్ గౌతమికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ వాసంతి



కలెక్టర్ గౌతమికి పుస్తకాన్ని అందిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం సిటీ: కొత్త కలెక్టర్ ఎం.గౌతమికి మంగళవారం ఘన స్వాగతం లభించింది. మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని పూలే విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి హాజరైన కలెక్టర్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం సీఈఓ చాంబర్‌కు వెళ్లారు. అక్కడ సైనిక సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లా అధికారి జల్లా శ్రీనివాసులు, సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ అమృతరాజ్ తదితరులు స్వాగతం పలికారు.

కలెక్టర్‌ను కలసిన ఎంపీ

అనంతపురం క్రైం: కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ గౌతమిను ఎంపీ తలారి రంగయ్య మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ తలారి రంగయ్య కలెక్టర్‌కు పుస్తకాన్ని అందజేసి, స్వాగతం పలికారు.

రోడ్డుపైనున్న చెత్త తొలగింపు

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగం శానిటరీ ఇన్‌స్పెక్టర్, మేస్త్రీల నిర్లక్ష్యంతో నాలుగు రోజులుగా రోడ్డుపైనే చెత్త పేరుకుపోవడం వివాదానికి దారి తీసింది. నగరంలోని సాయినగర్ ఐదో క్రాస్‌లోని ఓ ఆస్పత్రికి చెందిన చెత్తను నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగం సిబ్బంది తీసుకెళ్లలేదు. కమిషనర్ రమణారెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లడంతో స్వయంగా ఆయనే రంగంలోకి దిగారు. ఆస్పత్రి నుంచి చెత్త సేకరించేలా చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్య విభాగ సిబ్బందిని ఆదేశించారు. కాసేపటికే సిబ్బంది కాంపాక్టర్, ట్రాక్టర్ ద్వారా చెత్తను తరలించారు.

మట్టి పరీక్షలపై జిల్లా స్థాయి శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: భూసార పరీక్షల నిర్వహణలో భాగంగా పొలాల్లో మట్టిని ఎలా సేకరించాలనే అంశంపై నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్స్, మండల ఏవోలు, డివిజన్ ఏడీఏలకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం స్థానిక రూరల్ మండలం ఏ నారాయణపురం ఆర్‌బీకే పరిధిలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. పొలాల్లో మట్టిని సేకరించే విధానం, దాన్ని ప్రయోగశాలకు ఎలా పంపించాలనే అంశాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.చంద్రానాయక్, భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ ఎల్.రోజాపుష్పలత, కేవీకే శాస్త్రవేత్త శశికళ తదితరులు హాజరయ్యారు. శ్రీసత్యసాయి జిల్లా సిబ్బందికి స్థానిక ఎస్‌టీఎల్, ఎఫ్‌సీవో ల్యాబ్‌లో భూసార పరీక్షలపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ ముగిసింది.



భూసార పరీక్షలకు మట్టిసేకరించే విధానాన్ని తెలియజేస్తున్న డీఏవో చంద్రానాయక్

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం



నగరంలో సంక్షేమ పథకాల లబ్ధిని అడిగి తెలుసుకుంటున్న మేయర్ వసీం



మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అతికిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రాప్తాడులో 'జగనన్న మా భవిష్యత్తు' పోస్టర్లను పంపిణీ చేస్తున్న చిరుతల నాగేంద్ర

అనంతపురం రూరల్: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఏ నారాయణపురం పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హాజీవలి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల వేణుగోపాల్, బి.మదన్‌మోహన్‌రెడ్డి పురుషోత్తంరెడ్డి, రామాంజులరెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చంద్రబాబు నగర్‌లో ...

సచివాలయ వ్యవస్థ ద్వారా రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగనే రాష్ట్ర ప్రజల నమ్మకమని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదిక్‌వలి, రుద్రంపేట-4 ఎంపీటీసీ మహబూబీ పేర్కొన్నారు. మంగళవారం చంద్రబాబు నగర్‌లో ఎంపీటీసీ మహబూబీ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జిలాన్, వెంకటరాముడు, చంద్ర, అక్కమ్మ పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన

అనంతపురం క్రైం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని మేయర్ వసీం పేర్కొన్నారు. ఆయన అందిస్తున్న సంక్షేమ పాలనతో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. మంగళవారం నగరంలోని 40వ డివిజన్‌లోని ఆజాద్‌నగర్‌లో మేయర్ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలకు వివరించారు. వారి నుంచి సానుకూల స్పందన లభించింది. ప్రజల అంగీకారంతో ప్రతి ఇంటికీ మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లను మేయర్ అతికించారు. కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, ఇస్హాక్, నాయకులు ఖాజా, ఖాదర్ షరీఫ్, సందీప్, గౌతమి తదితరులున్నారు. వివిధ డివిజన్లలో కార్పొరేటర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు.

జగన్ పథకాలు చరిత్రాత్మకం

రాప్తాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు చరిత్రాత్మకమని వైఎస్సార్ సీపీ రాప్తాడు గ్రామ పంచాయతీ అధ్యక్షుడు చిరుతల నాగేంద్ర అన్నారు. మండల కేంద్రం రాప్తాడులో ఐదో రోజూ 'జగనన్న మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి ఇంటింటికీ వెళ్లి పలకరించారు. ప్రభుత్వం నుంచి వారికి చేకూరిన లబ్ధిని వివరించి, ఇంటి యాజమాని అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో మరూరు సొసైటీ అధ్యక్షుడు మాచిరెడ్డి కొండా రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణస్వామి, మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధామ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండల వ్యాప్తంగా మంగళవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటికీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీనాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు.



మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

17 నుంచి రుణాలు రెన్యూవల్ చేసుకోవాలి

ఆత్మకూరు: ఈనెల 17 నుంచి పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవాలని కెనెరా బ్యాంక్ సిబ్బంది మంగళవారం తెలిపారు. గ్రామాలవారీగా తేదీలు ప్రకటించినట్లు తెలిపారు. 17 నుంచి 26 వరకు ఆత్మకూరు, కుర్లపల్లి, తిమ్మాపురం, నారాయణపురం, ఎంఎం హళ్లి, 28 నుంచి మే 6 వరకు ముట్టాల, పాపంపల్లి , మే 8 నుంచి 19 వరకు గొరిదిండ్ల, డీకే తండా, మే 22 నుంచి మే 26 వరకు వై.కొత్తపల్లి, పీ యాలేరు, మే 29వ తేదీ నుంచి జూన్ 3వ వరకు సిద్దరాంపురం, పి.కొత్తపల్లి, జూన్ 5 నుంచి జూన్ 9 వరకు వేపచెర్ల, వీడీ తండా, వీఈ తండా, జూన్ 12 నుంచి జూన్ 13వ తేదీ వరకు పంపనూరు, పంపనూరు తండా, జూన్ 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు సింగంపల్లి, సింగంపల్లి తండా, జూన్ 19 నుంచి జూన్ 27 వరకు కాలువపల్లి, హనిమిరెడ్డిపల్లి, కొనంనపల్లి, గోళ్ల, జూన్ 28వ తేదీ నుంచి జూలై 7 వరకు నుసికొట్టాల, ఓబుళాపురం, మానిరేవు గ్రామాల రైతుల రుణాలు రెన్యూవల్ చేస్తున్నట్లు తెలియచేశారు.

18న షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

ఆత్మకూరు: ఈ నెల 18న అనంతపురం జిల్లా సీనియర్ బాలురు, బాలికల షూటింగ్ బాల్ జట్ల ఎంపికలు చేస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న ఉదయం 10 గంటలకు సనప ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సెల్: 8341411083లో సంప్రదించాలన్నారు.

అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు

ఆత్మకూరు: మండలంలో జాబ్ కార్డు ఉండి అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఏపీఓ సుజాతతో కలిసి ఆయన సిద్దరాంపురం వద్ద జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. ప్రస్తుతం రూ.250 కు పైగా కూలి వస్తోందన్నారు. వేసవిలో జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు.

ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

ఆత్మకూరు: గర్భిణులు ప్రతి నెలా తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి దయాకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని బి.యాలేరులో గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు చేసి, ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేశారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా హైరిస్క్ గర్భిణులకు వైద్యపరీక్షలు చేసినట్లు తెలిపారు. ఐరన్ మాత్రలు, ఆకు కూరలు, అనిన రకాల పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సబీహా సుల్తానా, వైద్య సిబ్బంది నాగేశ్వరయ్య, మునాఫ్, చంద్రావతి,తులసమ్మ, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.